
# దైవం మానుషరూపేణ

## సద్గురు శ్రీశ్రీశ్రీ దర్గాస్వామివారు

కడప జిల్లా

నీలకంఠరావుపేట



కాపీలకు :-

పెసల సుబ్బరామయ్య

గొలగమూడి

నెల్లూరు జిల్లా - 524 321

దేవుణ్ణి తెలుసుకునే మార్గం చెప్పమన్న భక్తులతో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు అంటారు - "నీయాల్నే వస్తే నీవేమి కనుక్కుంటావయ్యా" ఇది ఈనాడు కడపజిల్లా, నీలకంఠరావుపేట వాస్తవ్యులు శ్రీశ్రీశ్రీ దర్గాస్వామిగారి ఎడల అక్షరాల నిజమైంది. వారు మానవ రూపంలో మన ముందున్న భగవంతుడే అని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి. ఇది తెలియక కొందరు వీరిని ప్రశ్నలు చెప్పేవారుగా తలిస్తే మరికొందరు ధర్మ ప్రభువుగా తలిస్తే, మరికొందరు మరొకవిధంగా తలంచుచున్నారు. మరి కొంతమందికి తమలోని బలహీనతలే శ్రీ స్వామివారిలో కనిపించి వారిని మానవాకారం ధరించిన భగవంతుడుగా గుర్తించలేకున్నారు. వివిధ భక్తులకు వారితోగల అనుభవాలు చాలా స్వల్పంగా వివరించాను. ఈ అనుభవాల దృష్ట్యా వారు భగవంతుని ప్రతిరూపమేనని రూఢి అవుతుంది.

వారెంతటి మహనీయుడో తెలియనిదే హృదయపూర్వకమైన భక్తిశ్రద్ధలతో నమస్కరించలేము. అందరూ నమస్కరిస్తున్నారు గనుక మనమూ నమస్కరిస్తాము. వారెంతటి గొప్ప మహనీయులో



తెలియజేసి వారి ఎడల మన హృదయాలలో తగు విధమైన భక్తిశ్రద్ధలు ఏర్పడునట్లు చేయడమే ఈ చిన్ని పుస్తక ఆశయము.

భగవంతునికి మూడు లక్షణాలు చెప్పారు.

1) సర్వవ్యాపకుడు :- అందుగలడిందులేడని నందేహమువలదు అన్నట్లు విశ్వమందంతటను ఉన్నవాడు.

2) సర్వజ్ఞుడు :- సర్వ విషయములు తెలిసినవాడు. సృష్టిలోని ప్రతిదానిని గురించి భూత భవిష్యత్, వర్తమానములన్నీ తెలిసినవాడు.

3) సర్వసమర్థుడు :- ఏమైనా చేయగల సామర్థ్యముగలవాడు.

శ్రీశ్రీశ్రీ దుర్గాస్వామివారు భక్తులకనుగ్రహించిన అనుభవాలలో పై మూడు లక్షణాలు వారికున్నట్లు తెలుస్తుంది. గనుకనే వారిని మానవాకారం ధరించిన భగవంతుడని చెప్పగలగుచున్నాను. పూర్వాశ్రమంలో వీరిపేరు జె.వి. సుబ్బరాయుడుగారు.

శ్రీ దర్గాస్వామివారు కడపజిల్లా, ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లి అనే గ్రామంలో గంగిశెట్టి పెద్దచలమయ్య - సుబ్బమ్మ అనే పుణ్య దంపతులకు 6-7-1931 సం॥ అధిక ఆషాడ బహుళ షష్ఠి సోమవారం రాత్రి 9-00 గంటలకు జన్మించారు. నీలకంఠరావుపేట వాస్తవ్యులైన అమ్మయ్యగారిని వివాహమాడారు. ఋణానుబంధంవలన వివాహం జరిగింది కానీ, సామాన్య మానవులవలె శారీరక సంబంధంలేదు. కఠోర బ్రహ్మచర్య వ్రతాన్ని ఆచరిస్తూ దైవస్వరూపులైనారు.

శ్రీ రామకృష్ణ పరమహంస, శారదాదేవిగారి బ్రహ్మచర్య వ్రతాన్ని గూర్చి తెలియనివారుండరు. ఈ మహనీయుల తర్వాత నేటికి మరలా శ్రీశ్రీశ్రీ దర్గాస్వామివారు అమ్మయ్యగార్లను చూస్తున్నాము. ఈ కలియుగంలో వివాహమైకూడా బ్రహ్మచర్య వ్రత మాచరించడం వీరికే చెల్లినది.

ఈ మహనీయుడు దర్గాల దగ్గరకు విచ్చేయడం గురించి, బ్రహ్మచర్య వ్రతమాచరించడం గూర్చి రకరకాల వార్తలు తెలుస్తున్నాయి.



ఈ స్వామివారికి వివాహం కాకముందునుంచి అమేషా స్వప్నంలో ఇద్దరు మనుషులు కనిపించి మాకు దీపంపెట్టు నిన్ను పోషిస్తాము అని చెప్పేవారు. వివాహమయ్యాక శ్రీ అమ్మయ్యగారికి శ్రీ స్వామివారికి ఇద్దరికీ అలాగే కనిపించి చెప్పసాగారు. ఒకరోజు పట్టపగలే ఆ దివ్య వ్యక్తులు మార్గం చూపగా ఈ దంపతులు దర్గాల దగ్గరకొచ్చారు. అక్కడొకవ్యక్తి దర్శనమిచ్చి నీవు రెండు ఎండు కొమ్మలు నాటు. ఎక్కడ కొమ్మలు చిగురిస్తే అక్కడ స్థిరంచేసుకోమని ఆదేశించారు. అలాగే చేసి సమాదులను సేవిస్తుంటే, హిందువులువచ్చి ముస్లిమ్ సమాధులను సేవించడం అక్కడి ముస్లిములకు గిట్టలేదు. అందుచేత ఆ ముస్లిములు రాత్రి సమయంలో వచ్చి శ్రీ స్వామివారిని మంచంతో సహా ఎత్తుకుపోయారు. శ్రీ స్వామివారు నవ్వుకుంటూ సమాదులలో ఉండేవారికి ఏది ఇష్టమైతే అదే జరుగుతుందని తలచారు. పాములు తమపైన బడ్డట్టు ఆ ముస్లిములకు దర్శనంకావటంతో తిరిగి మంచంతోసహా శ్రీ స్వామివారిని తెచ్చి సమాదులచెంత చేర్చారు. సమాదుల దగ్గరకొచ్చాక అక్కడి అడవిలో కూర్చొని దంపతులిద్దరూ ఘోరంగా తపస్సు చేసేవారు. వీరి గురువుగారు అరబ్బీ

మంత్రాలు వ్రాసిన కాగితాలిచ్చాడట. ఒకరోజు ఆ కాగితాలు ఎ. రంగారావు గారికి చూపారు.

ఇక్కడి దర్గాల సమీపాన ఒక చెట్టుఉంది. ఆ చెట్టునుండి రెండు పాములు బయటికొచ్చి దర్గాలకు ప్రదక్షిణలు చేసి తిరిగి ఆ చెట్టులోకి పోయేవి. ఒక రోజు కొందరు గ్రామస్తులు ఆ చెట్టును కొట్టాలని గొడ్డళ్ళు తీసుకవచ్చారు. ఆ రెండు పాములు వారిపైన పడడంతో వాళ్ళు గొడ్డళ్ళు అక్కడ పారేసి దూరంగా వణుకుతూ ఆయాసపడుతూ నిలుచున్నారు. వాళ్ళ బాధచూచి శ్రీ స్వామివారే వాళ్ళకు తిరిగి ఆ గొడ్డళ్ళను తీసుకుపోయి ఇస్తే నమస్కరించి వెళ్ళారు. <u>మరికొందరి వివరణ :-</u> శ్రీ సాయి నాథుడే వీరిని ఈ ముస్లిం సమాదుల దగ్గరకు తీసుకవచ్చారని - శ్రీ దర్గాస్వామివారు చేతిలో సాంబ్రాణి కడ్డీలతో అక్కడికి వచ్చారని వారి దగ్గర అగ్గిపెట్టెలేదు. నేనిక్కడ ఉండాలనేదే నీ నిర్ణయమైతే ఈ సాంబ్రాణి కడ్డీలు వెలిగించే మార్గం చూపమని మానసికంగా ప్రార్థించారట. వెంటనే అక్కడొక అగ్గిపుల్ల, చిన్న అగ్గిచెక్కు దొరికాయట. వాటితో వెలిగించినాటినుండి అక్కడ సేవ చేస్తూ ఉన్నారట.



శ్రీ సి. సూర్యప్రకాశరావుగారు - రిటైర్డ్ హెడ్‌మాస్టర్, కావలి. ఇలా వ్రాస్తున్నారు.

పూజ్యగురుదేవులు దర్బార్ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సద్గురు దర్గాస్వామివారి పాదపద్మాలకు సాష్టాంగ ప్రణామములు. మేము తరచు దర్గాకుపోయి శ్రీ స్వామి దంపతుల ఆశీస్సులు గొని వచ్చేవారము. ఎప్పుడు ఏది ఇచ్చినా స్వీకరించని శ్రీ స్వామివారు - "మీరు తింటే నేను తిన్నట్లే. మీరు తిన్నవన్నీ నా పొట్టలో ఉన్నాయి. కాబట్టి ఇవి అన్నీ అందరికీ పంచి మీరు తినండి" అనేవారు. అంతేగాక మేము కారియర్ మూత తీయకముందే అవి ఏమిటో చెప్పేవారు. వారి సర్వజ్ఞత్వం అలా వెల్లడయ్యేది.

1996 ఆగష్టులో నాకు మలేరియా వ్యాధి వచ్చింది. 21 రోజులకు కూడా తిరుగుముఖం పట్టలేదు. భయంకరమైన మందులతో చాలా బాధగా ఉండేది. రోసోచిన్ మాత్రలు వేసుకొన్నప్పుడు కడుపులో అగ్నిగోళాలు తిరిగినంత మంటగా ఉంది. 26వతేది సాయంకాలం ఆ బాధ భరించలేక మానసికంగా శ్రీ స్వామివారితో ఇలా చెప్పుకొన్నాను. "మేము మీ దగ్గరకొచ్చినప్పుడల్లా - మేము తింటున్న సమస్తం మీలోకి చేరుతున్నట్లు చెప్పారు గదా.

ఇప్పుడు నేను మ్రింగుతున్న రోసోచిన్ మాత్రలుగూడా మీ పొట్టలోకి చేరుతున్నాయా? చేరితే వాటి ప్రభావం మీమీద చూపటంలేదా? మా పూర్వ జన్మ ప్రారబ్దంకొద్ది మేము అనుభవిస్తున్న ఈ బాధను మీరుకూడా అనుభవించకపోతే తగ్గించవచ్చుకదా ! అని అనుకొని కండ్లు మూసుకొన్నాను. పది నిమిషాలలో వళ్ళంతా చెమటపోసి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. అది మొదలు ఇక జ్వరం రాలేదు.

ఒక వారం తరువాత కావలికి శ్రీ స్వామివారిని ఆహ్వానించేందుకు మిత్రులతో కలసి నీలకంఠరావుపేటకు వెళ్ళాను. నాకు జ్వరం వచ్చిన విషయం శ్రీ స్వామివారికి చెప్పబోతే ఆపి కృష్ణారెడ్డిగారిని పిలచి పోయిన వారం జరిగిన సంగతి చెప్పమన్నారు. కృష్ణారెడ్డి ఇలా చెప్పారు. "పోయిన వారం శ్రీ స్వామివారికి అమ్మయ్యగారికి బాగా జ్వరం వచ్చింది. చాలా బాధపడ్డారు. మాత్రలు వేసుకోమంటే 'ఉండరా ఇప్పటికే కడుపునిండా మాత్రలు వేసియున్నారు' అని చెప్పి మందు తీసుకోలేదు. ఆ రాత్రికి జ్వరం తగ్గిపోయింది. మరుసటిరోజుకు మామూలుగా ఆరోగ్యంగా ఉన్నారు" అని చెప్పాడు.

చిత్రమేమంటే నాకు జ్వరం తగ్గిన సమయంలోనే శ్రీ



స్వామివారు అమ్మయ్యగారు జ్వరాన పడ్డారు. నేను బాధతో వారిని స్మరించిన క్షణంలోనే వారు జ్వరాన్ని తమ శరీరం మీదకు తీసుకొని నాకు బాధ తీర్చారు. ఎంతో దూరంలో ఉన్న నా ప్రార్థన విన్నారంటే వారు సర్వవ్యాపకులై ఉండాలి. నా జబ్బును తన శరీరంపైకి తీసుకున్నారంటే సర్వ సమర్థులని అర్థం. గనుక దైవమే మానవాకారంలో మనముందు నిలచిన రూపమే శ్రీ దర్గాస్వామివారు. నాకు గల ఇతర అనుభవాలెన్నో ఈ విషయం ఋజువు చేస్తున్నాయి. వారిని తగు విధంగా సేవించి, వారియందు విశ్వాసంగల్గి నడుచుకునేటట్లు చేయమని శ్రీ స్వామివారిని ప్రార్థిస్తున్నాను.

నా మిత్రుడు హైదరాబాద్‌నుండి ఇలా వ్రాస్తున్నారు. "నేను శ్రీ దర్గాస్వామిగారి దర్శనార్థం వెళ్ళాను. నా భార్య ఆరోగ్యవిషయం అడగాలని తలచాను. నేను వారికి నమస్కారం చేయగానే తన ఎడమచేత్తో కుడిచేతి జబ్బుమీద కొట్టుకొంటున్నారు. నేను నా భార్య ఆరోగ్య విషయం వారికి చెప్పనేలేదు. నేను మాట్లాడకముందే వారన్నారు. నేను నీ భార్యకు నొప్పి ఉండేచోట కొడుతున్నాను.

తగ్గిపోతుందిలే అన్నారు. నిజంగా నా భార్యకు అక్కడే నొప్పి, అది అడగాలనే వచ్చాను. నేను ఏమీ చెప్పకుండానే వారే అలా పలికారు. అనతికాలంలో ఆమె నొప్పి నుండి విముక్తి పొందింది. వారు సర్వజ్ఞులని, సర్వసమర్థులని, సర్వ వ్యాపకులని నిస్సందేహంగా చెప్పుచున్నాను" వారిని తగు విధంగా సేవించే భాగ్యం ప్రసాదించమని ఆ సద్గురుమూర్తిని ప్రార్థిస్తున్నాను.

శ్రీమతి డి. శారదగారు దమ్మపేట, ఖమ్మంజిల్లా వారికి నిత్యం రాత్రి 9-30 గం॥లకు టి.వి. చూచే అలవాటు. ఆ దురలవాటు పోగొట్టమని శ్రీ సాయినాథునికి అనేకసార్లు చెప్పుకొన్నది. కానీ ఆ అలవాటు పోలేదు.

ఈమె శ్రీ దర్గాస్వామివారిని దర్శించినప్పుడుకూడా తన దురలవాటును గూర్చి చెప్పడంగాని మనసులో ప్రార్థించడంగాని చేయలేదు. దమ్మపేటలో నున్న ఈమెకు ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో దమ్మపేట భక్తులు శ్రీ దర్గాస్వామిగారి దగ్గరకు పోతుంటే ఈమె తన నమస్కారాలు శ్రీ స్వామివారికి తెల్పమని చెప్పింది. వాళ్ళు శ్రీ స్వామివారికి అలాగే చెప్పారు. వెంటనే శ్రీ స్వామివారు "ఆమెకు 9-30



గం॥ ఉండే దుస్సాంగత్యం తొలగించుకోమని చెప్పు" అని అన్నారట. ఆ మాట శ్రీ స్వామివారే నాకు చెప్పినట్లుగా ఉంది అంటుంది ఈమె. కానీ తన దురలవాటు మానలేకపోయింది.

మరలా కొన్నాళ్ళకు శ్రీ దర్గాస్వామివారు ఈమె స్వప్నంలో కనిపించి "నీవు వ్యామోహం తొలగించుకోలేకున్నావు. ట్రాక్ దిగిపోతావు జాగ్రత్త అని కండ్లెర్రజేసి బెదిరిస్తున్నారట. ఈమె భయపడి గజగజ వణకిపోతుంది. స్వప్నం అంతమైంది. తెల్లవారినుండి టి.వి. చూడడం తనకు తెలియకుండాలనే పోయి పారాయణ చక్కగా జరుగుతుందట.

ఈ కరుణామయునకు మన అంతరంగాలు తెరచిన పుటలవలె ఉంటాయి కాబోలు. మన ప్రార్థన లేకుండానే మన దురభ్యాసాలు తొలగించడం ఎంత చిత్రమో చూడండి. ఇట్టి మహనీయుని మన మధ్య నిలిపిన ఆ దైవానికి ప్రణామములు.

కడపజిల్లా గాలివీడు గ్రామ వాస్తవ్యురాలు చిరుదుల విశాల ఇలా వ్రాస్తుంది.

ఈ మధ్య నాకు కడుపులో బాధ వచ్చింది. రాయచోటి ఆస్పత్రికి పోతే వాళ్ళు స్కానింగ్ చేసి కడుపులో గడ్డ ఉంది. ఆపరేషన్ ఒక్కటే మార్గమని చెప్పి డబ్బు తెమ్మన్నారు. ఆపరేషన్ అంటే ఆర్థికంగాను శారీరకంగాను భయపడి నేను శ్రీ దర్గాస్వామివారిని ఆశ్రయించాను. ఆ మహనీయుడు చూసి నీకు గడ్డలేదు ఏమిలేదు. 25 రోజులు ఇక్కడ ఉండు బాగుంటుందని చెప్పారు. ఇక్కడ నేను గత మూడు నెలలుగా ఉన్నాను. ప్రస్తుతం నాకు కడుపులో బాధ, నొప్పి ఏమీలేవు. నేను ఏమందులూ వాడలేదు. శ్రీ దర్గాస్వామివారి కృపవల్ల హాయిగా ఉన్నాను. శ్రీ స్వామివారు ఆజ్ఞ ఇస్తే వెళ్ళుతాము.

ఒక సంవత్సరం క్రిందట నా భర్త రమణయ్య గారికి పిచ్చి వచ్చింది. బెంగుళూరులో మందులు వాడాము. తగ్గినట్లే ఉండి మరలా వచ్చింది. ఇక భరించలేక శ్రీ దర్గాస్వామివారి పాదముల నాశ్రయించాము. ప్రస్తుతం ఏ మందులు వైద్యాలు లేకుండానే ఆరోగ్యంగా ఉన్నాడు. శ్రీ స్వామివారు ఆజ్ఞ ఇచ్చినప్పుడు ఇంటికి పోతాము.

ఇట్లు
సి. విశాల
సి. రమణయ్య



శ్రీ దారా నాగేశ్వరరావుగారు ఖమ్మంజిల్లా దమ్మపేట 1994లో శ్రీశ్రీశ్రీ దర్గాస్వామివారి దర్శనార్థం వెళ్ళినప్పుడు శ్రీ స్వామివారు వారిని శ్రీ గురు చరిత్రను ఎక్కడో ఒక చోట తెరువమన్నారు. వారు తెరిచిన చోట 10వ అధ్యాయంలో వల్లభేసుని దొంగలు చంపబోతే శ్రీ శ్రీపాదులవారు రక్షించిన సన్నివేశం వచ్చింది. దీన్ని నిత్యం శ్రద్ధగా పారాయణ చేస్తుండమని చెప్పారు. నాగేశ్వరరావుగారు అలాగే చేస్తూ వచ్చారు. 1996వ సం॥లో వీరు శ్రీపాదస్వామివారి దర్శనార్థం కురుపురం పోతూ కృష్ణానదిని బుట్టపడవలో దాటవలసి వచ్చింది. బుట్ట నది మధ్యలోకి వెళ్ళేసరికి బుట్టకు రంధ్రంపడి నీళ్ళు బుట్టలోకి వచ్చేస్తున్నాయి. బుట్ట నడిపేవాడు బుట్ట మునిగిపోతుంది. అందరూ నదిలో దూకెయ్యండి. ఈత వచ్చినవాళ్ళు ఒడ్డుకు చేరుతారు అని అరుస్తూ తాను నీటిలోకి దూకేశాడు. అతనితోటి మిగిలిన అందరూ దూకేశారు. కానీ ఒక ఆడమనిషి, పదిహేను సం॥ వయసుగల ఆమె కుమార్తె, నాగేశ్వరరావుగారు ఈత రానందున బుట్టలో ఉండిపోయారు. నిమిషంలో బుట్ట ప్రక్కకు ఒరిగిపోయి నాగేశ్వరరావు నీటిలో ఉన్నాడు. ప్రాణభీతిచే తనను రక్షించమని శ్రీపాదస్వామిని ప్రార్థిస్తూ బిగ్గరగా అరుస్తున్నాడు. బుట్టవాడు అందులో ఉన్న ఆమెను

రెట్టపట్టుకొని ఒడ్డుకు తీసుకుపోతున్నాడు. ఈలోగా నదిలో తేలుతున్న బొగ్గులమూట దొరికినందున దాన్ని పట్టుకున్నాడు. ఆ మూట ఒక బండకు తగిలి ప్రవాహంలో కొట్టుకపోకుండా ఆగింది. అది అలా ఆగకుంటే వారు ప్రవాహంలో కొట్టుకపోయేవారే. బుట్టవాడు వచ్చి వారిని ఒడ్డుకు లాక్కుపోయాడు. ఈ ప్రమాదంలో 15 సం॥ అమ్మాయి చనిపోయింది. శ్రీ దర్గాస్వామివారు 2 సంవత్సరాలకు ముందే శ్రీపాదులవారి దగ్గర ఈ ప్రమాదం జరుగుతుందని తెలిసే వల్లభేసుని వృత్తాంతం నిత్యం పారాయణ చేయమన్నారు. మానవాకారం ధరించిన దైవమే శ్రీ దర్గాస్వామివారని నా దృఢ నమ్మకము.

డి. జయచంద్రారెడ్డిగారు నెల్లూరు. ఇలా వ్రాస్తున్నారు.

1993 సం॥లో కె.వి. రంగారావుగారు మా దంపతులను వెంటనే శ్రీ దర్గాస్వామివారి దర్శనం చేసుకోమని ఫోను చేశాడు. ఆ సమయంలో రొయ్యల పరిశ్రమలో లక్షలు నష్టపోయి అప్పులతో దిక్కుతోచక ఉన్నాను. నా భార్య ప్రోద్బలముతో శ్రీ దర్గాస్వామివారి దర్శనార్థం నీలకంఠరావుపేట వెళ్ళాము. మా ఆవిడ శ్రీ స్వామివారికి



దగ్గరలో కూర్చోనుంది. నేను దూరంగా ఉన్నాను. శ్రీ స్వామివారు నావైపు చూచి "ఒరే నాయనా నీ గురువు ఇక్కడకూడా ఉన్నారులేరా! నీ బాధ ఏమిటో చెప్పుకోరా" అన్నారు. నేను వారికి పాదాభివందనం చేసి నా కష్టం చెప్పుకొన్నాను "నీవు మరలా అదే పరిశ్రమలో దిగు, బయట పడగలవు" అన్నారు. "నా దగ్గర చిల్లిగవ్వలేదు. రెండు లక్షలు పెట్టుబడి ఎక్కడ తేగలను" అంటే "అదంతా నాకు తెలియదు ఈ సారి నీ సమస్య తీరుతుంది" అంటూ నవ్వుతూ "అలా తీరితే నాకేమి ఇస్తావు" అన్నారు. ఈయన ప్రతిఫలం ఆశించేవాడుగా ఉన్నాడే. సమస్య తీరితే ఏదో ఒకటి ఇస్తాములే అనుకొని వచ్చేశాము. నేను తిరిగి రొయ్యల పరిశ్రమలో దిగాను. ఆ తర్వాత మూడు నెలలోనే నా అప్పులన్నీ తీరి బయటపడ్డాను. నేను రూ. 1116/- శ్రీ స్వామివారికి పంపితే అక్కడ జరుగుతున్న అన్న సంతర్పణకిమ్మన్నారు. ఆ మహనీయుని దర్శనముతో ఒక్క మాటలో నా బాదాకరమైన పరిస్థితినుండి బయట పడేసిన దైవ స్వరూపులు వారు.

మా కొమార్తెకు రెండు సంవత్సరములనుండి పెండ్లి సంబంధాలు చూస్తూ వారి దగ్గరకు తీసుకపోయాము.

"మీ నాయన నిన్ను అమెరికా పంపాలంటున్నాడు పోతావా? పోతావులే" అన్నారు. శ్రీ స్వామివారు ఈమె జాతకం చూచి "ఈమెది పుష్యమి నక్షత్రం - పునర్వసు నక్షత్రం ఉండే పిల్లవాడు కావాలి. కుదురుతుందిలే" అన్నారు. శ్రీ స్వామివారు ఒకరోజు ఫోనుచేసి ఇప్పుడు వచ్చిన సంబంధం నక్షత్రాలు కలిసాయి. మంచిదే. కానీ మీరనుకున్నదానికంటే ఒకటి రెండు లక్షలు ఎక్కువ అడుగుతారు. ఈ సంబంధం పోనీయవద్దని చెప్పారు. 29-9-2000 నిశ్చితార్థం 11-10-2000 వివాహం 31-10-2000 దంపతులు అమెరికా పోవడం అక్కడే అబ్బాయి ఉద్యోగం చేయడం జరుగుతుంది. వారిమాట వేదవాక్కు.

శ్రీమతి డి. శారదగారు - దమ్మపేట. తాను కన్నులారా చూచిన విషయం ఇలా వివరిస్తున్నారు.

నేను మా మిత్రులతో కలసి శ్రీ స్వామివారి దర్శనార్థం వెళ్ళినప్పుడు అక్కడ కోతులతో ఆడుకునే పది సంవత్సరాల బిడ్డను గూర్చి అక్కడున్న ఒకరు ఇలా చెప్పారు. ఈ పిల్లవాడు బొత్తిగా నడవలేని స్థితిలో ఇతని తల్లిదండ్రులు ఇక్కడికి తీసుకవచ్చారు. మోకాళ్ళక్రిందనుండి ఏదో



వ్యాధివలన కాళ్ళు చచ్చుగా మారాయి. ఎందరో డాక్టర్లు, వైద్యుల ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. శ్రీ స్వామివారు ఆ బిడ్డను నిలుచోమన్నారు. కానీ ఆ బిడ్డ నిలబడలేకుంటే తల్లిదండ్రేలే నిలబెట్టారు. శ్రీ స్వామివారు తన దండముతో రెండు మోకాళ్ళమీద కొట్టి ఆ దండముతో కాళ్ళ క్రిందవరకు తాకించారు. ఆ పిల్లవాణ్ణి ప్రదక్షిణ చేయమంటే చేయలేకున్నాడు. తల్లిదండ్రులే బలవంతంగా దర్గాలచుట్టూ ప్రదక్షిణ చేయించి శ్రీ స్వామి దగ్గర నిలబెట్టారు. ఇదే విధంగా మరి రెండుసార్లు చేయగానే తల్లిదండ్రుల సహాయం లేకుండానే ఆ పిల్లవాడు ప్రదక్షిణ చేయడం చూచి, అందరూ ఆశ్చర్య చకితులై స్వామివారికి జేజేలు పలికారు. శ్రీ స్వామివారు ఆ బిడ్డను నలభై రోజులు అక్కడే ఉంచమన్నారు. అలానే ఉన్నాడు. ఈ విషయాన్ని ఆ బాబును అడిగితే "నేను స్వామి దగ్గరకొచ్చాకనే నడుస్తున్నాను" అని చెప్పాడు. ఆ తల్లిదండ్రులు శ్రీ స్వామివారి ఎడల ఎంత భక్తి విశ్వాసాలు గలిగి ఉన్నారో గదా ! ఈ లీల చదివిన మనందరికీ శ్రీ స్వామివారి ఎడల అలాంటి భక్తి శ్రద్ధలు కలగాలని శ్రీ స్వామివారిని ప్రార్థిస్తున్నాను.

కావలి వాస్తవ్యులు రిటైర్డ్ హెడ్మాష్టరు శ్రీ ఎ. రంగారావు గారు ఇలా వ్రాస్తున్నారు.

నాకు చాలా కాలంగా శ్రీ దర్గాస్వామివారితో పరిచయముంది. వారు మా దంపతులనెంతో ప్రేమగా చూచుకుంటారు. మేము కావలి నుండి బయలుదేరగానే రంగడొస్తున్నాడని అమ్మయ్యగారితో చెపుతారు. ఒకరోజు నేను శ్రీ స్వామివారి సన్నిధిలో ఉన్నాను. "ఒరే రంగా! మీ ఇంటి దొడ్డితలుపు గడియ వేయకుండానే పడుకున్నారు. అక్కడుండే సైకిల్ ఎవరైనా తీసుకపోయినా పోతారు గదా" అన్నారు. తెల్లవారి ఇంటికి వెళ్ళాక విచారిస్తే అది అక్షరాల నిజమని తేలింది.

ఒక రోజు నేను చేసిన చిన్న తప్పుకు గట్టిగా బుద్ధి చెప్పారు. శ్రీ స్వామివారు కావలి వచ్చియున్నారు. నేను స్వామి సన్నిధిలో ఉండగా నా స్నేహితులొచ్చారని మనిషి వచ్చాడు. ఆ వచ్చింది ఎవరైంది నాకు తెలుసు. ఎంతసేపు నేను ఇంట్లో ఉండాలో తెలుసు, వాళ్ళను రైలు ఎక్కించి గాని నేను శ్రీ స్వామివారి సన్నిధికి రాననికూడా తెలుసు. ఇన్ని తెలిసికూడా శ్రీ స్వామివారికి నిజం చెప్పకుండా "ఇంటిదాక వెళ్ళి వస్తాను స్వామి" అని చెప్పి వెళ్ళాను. ఆ



మిత్రులను రైలు ఎక్కించి వచ్చేసరికి శ్రీ స్వామివారు కారులో నీకంఠరావుపేట వెళ్ళిపోతున్నారు. శ్రీ స్వామివారికి నమస్కారాలు చెప్పాలని మరొకరి కారులో వెంబడించాను. ఐదు, పది నిమిషాలలో శ్రీ స్వామివారి కారును క్రాస్ చేయగలనని తలచాను. అలాంటిది ఒక గంట తర్వాత కలుసుకున్నాను. నమస్కరించి వచ్చేయాలనుకున్నాను. కానీ నన్ను తన కారు ఎక్కమని నేను వచ్చిన కారును వెనుకకు పంపారు. కారులో తన ప్రక్కన కూర్చోబెట్టుకొని ఒక గంటసేపు సద్గురువును ఎలా సేవించాలో బోధించారు. ఇంతా ఆ మాటల సారాంశం ఒక్కటే గురువుగారితో లోపలొకటి బయటికొకటిగా మాట్లాడరాదు. అది చాలా దోషం అని బోధించారు. ఇది నేను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తమని గ్రహించాను.

మరొక రోజున నేను శ్రీ స్వామివారి సన్నిధిలో జపం చేస్తున్నాను. లెక్క కొరకు జపమాల చేతిలో ఉంది. జపం చేయడం అయ్యాక శ్రీ స్వామివారు నన్ను పిలచి ఎంత జపంచేశావని అడిగారు. జపమాల సహాయంతో చేశాను గనుక ఇంత సంఖ్య అని చెప్పాను. వెంటనే శ్రీ స్వామివారన్నారు "అది జపమేకాదు. జపానికి ఎప్పుడూ

లెక్క ఉండకూడదు అన్నారు. అలాగే ప్రదక్షిణలు చేసేవారుకూడా లెక్కపెట్టి చేయడం తప్పని చెప్పారు.

ఒకరోజు నా భార్య స్కూలులో పడిపోయింది. టీచర్స్ అంతా ఆమెను వైద్యశాలకు తీసుకపోయారు. ఆ డాక్టరు ఇంజక్షన్లు వాడి ఆమెకు గుండెజబ్బు. ప్రమాదస్థితి అన్నారు. నెల్లూరు తీసుకపోయాము. వాళ్ళూ అన్ని పరీక్షలు చేసి ప్రమాద పరిస్థితి హైదరాబాద్ వెళ్ళమన్నారు. ఇక తప్పదని శ్రీ స్వామివారి దగ్గరకు వెళ్ళాము. ఆమెకు ఏమీలేదు బాగుంది. గొలగమూడి వెళ్ళి మూడు నిద్రలు చేయమన్నారు శ్రీ స్వామివారు. అలాచేస్తే అంత ప్రమాద స్థితి ఏమైందోగాని ఆమె ఏ వైద్యం లేకుండా ఆరోగ్యంగా ఉంది. వారు భగవంతుడు కానిదే అలా చేయలేరు.

నేను కుటుంబ సమేతంగా తుంగభద్రా పుష్కరాలకు మాంత్రాలయం వెళ్ళాను. యాత్రికుల రద్దీవలన అక్కడ రూమే దొరకలేదు. చూచిన వరకు చాలని ఇంటికి రాబోతున్నాము. ఎవరో ఒక చిన్న పిల్లవాడు వచ్చి ఎవరో నన్ను పిలుస్తున్నారని తీసుకవెళ్ళాడు. ఆ పెద్దమనిషి నీకు రూము కావాలా అని అడిగి గెస్ట్‌హవుస్ ఇమ్మని చీటీ పంపారు. ఆ గెస్ట్‌హవుస్ చూచి బాడుగ చాలా ఎక్కువగా



ఉంటుందని - బాడుగ ఎంత అని అడిగాను. ఫ్రీగా ఇమ్మని చీటీ వ్రాశారండీ అనిచెప్పారు. నాకు మతిపోయింది. తిరిగి ఇంటికి పోదామనుకునే సమయంలో గెస్ట్‌హవుస్ ఫ్రీగా ఇమ్మనడమేమిటి. ఫ్రీగా ఇప్పించేటట్లు ఎవరు చేసి ఉంటారు. దీనికంతా మూల కారణం శ్రీ స్వామివారేనని తెలుసుకొన్నాను. శ్రీ స్వామివారికి నామీద ఎంత దయ! ఏమిచేసి వారి ఋణం తీర్చగలను.

ఇదే విధంగా మా పెద్దబ్బాయి రామక్రిష్ణకు ఇంజనీరంగ్ సీటు వచ్చింది. కానీ ఫ్రీ సీటు కాకుండా డొనేషన్ కట్టాలన్నారు. నా కంత శక్తిలేదు. అకోలాలో రహమాన్ అనే వారు కలసి మీరు పూసద్ వెళ్ళి నాపేరు చెప్పండి ఫ్రీ సీటు ఇస్తారని చెప్పారు. చివరి ఆశగా వెళ్ళాము. వారి పేరు చెప్పగానే ఫ్రీ సీటు ఇచ్చారు. ఈ రహమాన్ ఎవరు? నన్నెట్ల కలిశారు? నాకెందుకు ఫ్రీ సీటు ఇప్పించారు. ఈ నాటకానికంతకూ మూల పురుషుడు శ్రీ స్వామివారేనని గట్టిగా నమ్మాను. ఆ కృతజ్ఞతతోనే నమస్కరించాను.

ఖమ్మంజిల్లా, దమ్మపేట గ్రామ వాస్తవ్యులు పసుమర్తి శీను అనేవారికి ఎన్ని సంబంధాలు చూచినా వివాహం కాలేదు. మిత్రుల సలహామీద అరుణాచలం వెళ్ళి

గిరిప్రదక్షిణ చేస్తున్నాడు. కొండచుట్టూ తిరిగితే పెండ్లవుతుందా? అని పదే పదే అనుకొంటూ ప్రదక్షిణ చేశాడు. ఆ తర్వాత వారు శ్రీ దర్గాస్వామివారి దగ్గర కొచ్చాడు. ఆ యువకుడు చెప్పకముందే శ్రీ స్వామివారు "ఏమయ్యా కొండ చుట్టూ తిరిగితే పెండ్లవుతుందా? అని అనుకొంటూ ప్రదక్షిణ చేస్తావేమిటి. నీవు శ్రీరామ చంద్రునికి వివాహం చేయించు నీకు పెండ్లి అవుతుంది" అని చెప్పారు. శీను శ్రీరామచంద్రునికి వివాహం చేయించగానే అతని వివాహం కూడా చక్కగా జరిగిపోయింది.

ఎక్కడో అరుణాచలంలో అతని మనసులో మెదిలిన సంశయాన్ని శ్రీ స్వామివారు నీలకంఠరావుపేటలో చెప్పడమెంత చిత్రమో చూడండి. శీను విషయమేగాక మన ఆలోచనలు మాటలు సర్వం శ్రీ స్వామివారికి తెలుస్తుంటాయనడానికిది ఒక మంచి నిదర్శనం.

దర్బార్ సాయి భవన శంకుస్థాపనకు గొలగమూడికి శ్రీ స్వామివారు వచ్చారు. శంకుస్థాపన జరిగే చోట శ్రీ స్వామివారు అక్కడి కొచ్చిన భక్తులందరనీ భక్తితో తొచినది సమర్పించమని అడుగుతున్నారు. కొంతమందినైతే ఐదువేలు ఇస్తామని చెప్పు శ్రీ వెంకయ్యతాతగారు నీ



జబ్బు నయం చేస్తారు అని మరికొందరిని పదివేలిమ్మని అడుగుతున్నారు. వాళ్ళు ఇంటికి వెళ్ళి చెపుతాము స్వామీ అంటే ఇంటికి వెళ్ళాక ఇవ్వడం - చెప్పడం ఇక్కడే అని నవ్వుతున్నారు. వేలు ఇచ్చిన వారుకూడా దూరంగానే ఉన్నారు. ఒక పేదరాలు అంతమందిలో ఒక్కరూపాయ సమర్పించింది. ఆ తల్లి రెండు చేతులూ శ్రీ స్వామివారు పట్టుకొని ఈ తల్లి భక్తితో ఒక రూపాయి సమర్పించింది. అదే నాకు పదివేలని మెచ్చుకున్నారు. చూచే ప్రేక్షకులలో కొందరు "ఇదెక్కడి స్వామిరా బాబూ. ఇంత గొప్పడబ్బు పిచ్చిఉండేవారిని తీసుక వచ్చారు" అని అనుకుంటున్నారు.

శ్రీ స్వామివారు అన్నాల హాలుకు నడిచిపోతున్నారు. ఒక భక్తుడు మధ్యదోవలో శ్రీ స్వామివారి పాదాలు పట్టుకొని వదలలేదు. కారణం చెప్పమని శ్రీ స్వామివారు ఎంతో అనునయంగా అడిగినా చెప్పలేదు. తన తనివితీరాక ఆ భక్తుడు లేచి తానొక మందిరం కట్టిస్తున్నానని వారి చేత్తో ఏమైనా ఇవ్వమని అర్థించాడు. శంకుస్థాపన దగ్గర వచ్చిన డబ్బంతా రిసీవర్ గారికి ఇచ్చేశారు. ఇక వారి దగ్గర డబ్బులేదు. రిసీవర్ గారిని పిలచి ఇంటికి వెళ్ళాక నీకు పంపుతాను నాకు ఐదువేలు అప్పుగా ఇవ్వు అని అడిగి తీసుకొని ఆ భక్తునికిచ్చారు. అంతేగాక నీ అడ్రసు ఇచ్చిపో

మరికొంత డి.డి. తీసి పంపుతాను అని చెప్పారు. శంకుస్థాపన దగ్గర అందరినీ డబ్బులిమ్మని అడుగుతుంటే ఈయనకు డబ్బుపిచ్చి అని అనుకున్నవాళ్ళు ఇప్పుడు ఈ సన్నివేశం చూచారో లేదోమరి. వారు గొలగమూడికి వచ్చి సంపాదించినది ఐదువేల రూపాయల అప్పు.

కొంతమంది సాదువులు మేము డబ్బు తాకము అని చెపుతూ భక్తులు తమకు ఇచ్చే డబ్బు మరొకరి దగ్గర ఉంచుతారు. డబ్బు మనసుతో తాకకూడదు. చేతులతో తాకితే ఏమీకాదు. శ్రీ స్వామివారు ఎన్ని లక్షలు ఎలా దానం చేస్తారో, ఎన్ని వివాహాలు చేయిస్తారో, ఎందరు విద్యార్థులను చదివిస్తారో లెక్క ఉండదు. ఎప్పుడూ వీరిదగ్గర డబ్బు ఉండదు. ఈ విషయంలో వీరు షిరిడీసాయిని పోలి ఉంటారు. ఇంతటి మహనీయ మూర్తి మనకు మానవ రూపంలో లభించారు. వారికి మనం సమర్పించే కానుకలకంటే మనం నిత్యజీవితంలో ఆచరించే సత్యం, ధర్మమే గొప్ప కానుకలని ఎరిగి వారు మన లోపల బయట నిరంతరం సాక్షి రూపంలో ఉన్నారనే గుర్తింపుతో వారిని సేవించి తరిద్దాం.

జై సద్గురుదేవా!

**ః బస్సు మార్గము ః**

కడప నుండి రాయచోటి మార్గములో నడిచే బస్సు ఎక్కి నీలకంఠరావుపేట - దర్గాస్వామి దగ్గరకు అని చెప్పి దిగాలి.